# మృగతృష్ణ

''టెలిగ్రాం'' అనే కేక విని పరుగెత్తుకెళ్లి తలుపుతీశాను.

చాలా చీకటి పడిపోయింది. ఇంట్లో ఏదో ఆలోచనలతో కూర్చున్న నేను ఇంత టైం అయిపోయిందని అనుకోలేదు.

**అమాంతం ఓరోజు టెలిగ్రాం వచ్చిపడింది! వెంటనే వచ్చి ఉద్యోగంలో జాయిన్ అవ్వవలసిందిగా! ఈ దేశంలో నిరుద్యోగులెంతో మంది వుండగా ఆ టెలిగ్రాం అతనికే ఎందుకొచ్చింది!**

కరంటు కోతవల్ల వెలగని వీధి దీపాలు, అన్ని అర్హతలూ ఉన్నా, నిరుద్యోగిగా ఉన్నందువల్ల తల్లిదండ్రులకు వెలుగులందించలేని నాలాగే కనిపించాయి.

నాకు టెలిగ్రాం పంపే దెవరా అని ఆశ్చర్యంతో చూశాను. సంతకం పెట్టి టెలిగ్రాం తీసుకున్నాను.

కొన ఊపిరితో వెలుగుతున్న హరికెన్ లాంప్ వెలుగులో టెలిగ్రాం చదివాను. మరోసారి చదివాను. నా కళ్లను నేనే నమ్మలేకపోయాను. నేను చదువుతున్నది నిజమేనా?

వెంటనే డ్యూటీలో చేరమని ఉందా టెలిగ్రామ్‌లో!

నేను పుట్టినప్పటినుంచి విద్యుద్దీపాలు వెలగని మా ఇల్లు విద్యుద్దీపాలతో కళకళలాడుతున్నట్లు తోచింది.

మరోసారి చదివేను. నిజమే. నేను తప్పు చదవలేదు.

వెంటనే డ్యూటీలో చేరండి.

టెలిగ్రాం పంపిన వారి చిరునామా చూశాను. ఏదో ఢిల్లీ కంపెనీ. గుర్తు తెచ్చుకుందామని ఎంత ప్రయత్నించినా ఆ కంపెనీకి ఇంటర్వ్యూకి వెళ్లినట్లు నాకు గుర్తురాలేదు. బహుశా, వెళ్లే ఉంటానేమో! లేకపోతే ఈ విశాల భారతదేశంలో ఉన్న శతకోటినిరుద్యోగులలో నన్నుగుర్తించుకుని నాకే టెలిగ్రాం పంపటం ఎందుకు?

నా నెత్తిమీద వెంట్రుకలెన్నీ, అంటే ఠక్కున చెప్పగలనేమోగాని, ఎన్ని ఇంటర్వ్యూలకి వెళ్లావంటే చెప్పటం కష్టం. అన్ని ఇంటర్వ్యూ కార్డులు జిరాక్స్ చేసి జాగ్రత్తగా ఫైల్ చేసి ఉంచాము కొట్టుగదిలో.

లాంతరు తీసికొని వెళ్లి కొట్టు తలుపులు తీశాను. అతిథి అడుగుపెట్టాడని చెప్పాలని కాబోలు, నేలపై ఆడుతున్న బొద్దింకలు నన్ను చూసి పరుగెత్తాయి. నన్ను చూసిన దోమలు ఆప్యాయంగానూ, ఆనందంగానూ ఇస్లాం పద్ధతిలోనూ నన్ను ఒంటికి హత్తుకుని స్వాగతం పలికేయి.

సర్దిపెట్టిన ఫైల్స్ ఒకటి తర్వాత ఒకటి విప్పి చూశాను. కావల్సిన కాగితం దొరకలేదు. ఏమయివుంటుంది.

హఠాత్తుగా గుర్తుకొచ్చింది. ఇంటర్వ్యూ కాగితం ఫైల్ చేయలేదేమో? ప్రతీ కాగితమూ జిరాక్స్ చెయ్యమని మా నాన్నగారు రెండు రూపాయలిస్తారు కానీ నాలో ఓ వీక్‌నెస్ ఉంది. లాటరీ టికెట్ అంటే నాకు మక్కువ. అందుకే అప్పుడప్పుడు జిరాక్స్ తీయించకుండా లాటరీ టికెట్ కొంటూ ఉంటాను. ఉద్యోగానికన్నా, లాటరీ పలకటానికే అవకాశం ఎక్కువ.

గడియారం ఎనిమిది సార్లు మ్రోగింది. అమ్మ, నాన్నగారు ఇంకా ఇంటికి రాలేదు. రాత్రి బండికి బయలుదేరకపోతే లాభం లేదు. నాన్నగారు రావాలి. డబ్బులివ్వాలి.

ఓ నిమిషం ఆలోచించాను. నాన్నగారు రావటం ఆలస్యమైతే... నాన్నగారైనా డబ్బుగురించి వెళ్లేది రాయుడిగారి దగ్గరకేగా.

నేనే బయలుదేరాను.

రాయుడుగారు మాకు రిజర్వు బేంకే. నేను ఇంటర్వ్యూ కెళ్లినప్పుడల్లా నాన్నగారు అతని దగ్గరనుంచే డబ్బు తెస్తారు.

గబగబా నడిచాను. మా వీధిలో దీపాలులేవుగానీ, రాయుడిగారి వీధి, ఇల్లూ కూడా దీపాలతో కళకళలాడుతున్నాయి.

''ఏమోయ్ పంతులూ, మళ్లీ ఏదైనా ఇంటర్వ్యూ వచ్చిందా?'' నన్ను చూసిన రాయుడుగారు వెంటనే అడిగేరు.

ఈసారి ఇంటర్వ్యూ కాదండీ.. ఉద్యోగమే వచ్చింది.

''ఉద్యోగమే!'' రాయుడిగారి గొంతులో ఆశ్చర్యం ధ్వనించింది.

''ఔనండి. ఉద్యోగంలో చేరమని టెలిగ్రాం వచ్చింది.''

''ఐతే ఈసారి పెద్ద మొత్తమే అడుగుతావన్నమాట. ఇంతకీ ఉద్యోగం ఏ ఊరిలో?''

''ఢిల్లీలోనండి''

''ఢిల్లీలోనే? జీతమెంత?''

''తెలీదండి''

రాయుడుగారు లోపలికెళ్లారు. ఆరువందలు తీసికొచ్చి ఇచ్చారు.

తీసుకో పంతులూ, రాయుడుగారు అన్నారు. బాకీ పెరిగిపోతోందని బాధపడకు. ఓ ఆరు నెలలు ఉద్యోగం రాలేదనుకో. అదే తీరిపోతుంది.''

ఇంటికి వచ్చేసరికి నాన్నగారు, అమ్మ వచ్చేశారు. టెలిగ్రాం సంగతి చెప్పాను. 'ఏమోరా నాకు నమ్మకం కుదరడంలేదు. ఈ టెలిగ్రాం

ఎల్.ఆర్.స్వామి

నీకేనంటావా?'' నాన్నగారన్నారు.

మరోసారి టెలిగ్రాం చూశాను. నాపేరే! మా అడ్రస్సే! మా ఇంటి నంబరే! రాత్రి బండికే బయలుదేరాను. ఢిల్లీ చేరుకున్నాను. ఫేక్టరీ గేటు దగ్గర బస్సు ఆగింది. బస్సు దిగిన నా గుండెలు గబగబా కొట్టుకున్నాయి. ఎంత పెద్ద ఫేక్టరీ! ఎన్ని పొగగొట్టాలు.

ఎదురుగా గేటు దగ్గర నించున్న సాయుధ రక్షక భటులు యమకింకరులా కనిపించారు. నా చేతిలోని టెలిగ్రాం వాళ్లకి చూపాను. ఒకరి మొహాలొకరు చూసుకుని ఏవేవో నన్ను హిందీలో అడిగేరు. నాకర్థం కాలేదు.

రెండు హిందీ ముక్కలు కూడా రానివాడు ఉద్యోగం ఏం చేస్తాడన్నట్లు హేళనగా చూసారు వాళ్లు.

''రిసెప్షన్ రిసెప్షన్'' అతికష్టం మీద పలికేడు ఒకడు. దారి చూపుతున్నట్లు, వేలు అటు చూపాడు.

రిసెప్షనిస్టు టెలిగ్రాం చూసి కూర్చోమన్నాడు. నా ఎదుట కనిపించిన గడియారం ముల్లు

## ఉగాది కొంటెకథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ!

కదులుతూనే ఉన్నాయి. నాగురించి ఎవరూ పట్టించుకోలేదు.

నాకు ఆకలేసింది. దాహం కూడాను. మంచి నీళ్లన్నా త్రాగితే బాగుంటుందని లేచాను.

రెండడుగులు వేసి ఆగిపోయాను. ఎదురుగా నడిచివస్తున్నాడు శర్మ. ఆ మరోసారి చూశాను. అవును శర్మే!

శర్మదీ మా అగ్రహారమే! చిన్నప్పటినుంచి కలిసి ఆడుకున్నాం, చదువుకున్నాం. వాడు ప్రతి భాశాలి కనుక మెట్రిక్‌తో చదువు ఆపేశాడు. స్టెనోగ్రాఫీ నేర్చుకున్నాడు. ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడని తెలుసుగానీ ఇక్కడే పని చేస్తున్నాడని అనుకోలేదు. హడావిడిగా బయలుదేరటంవల్ల వాడి చిరునామా తీసికోలేకపోయానే అని బాధపడుతూనే ఉన్నాను.

వాడు నన్ను చూసినట్లే ఉన్నాడు. తిన్నగా నా దగ్గరకేవచ్చాడు. "నువ్వేంటిరా ఇక్కడ" వాడి కళ్లు ఆశ్చర్యంతోనూ, ఆనందంతోనూ వెలిగాయి. అంతా చెప్పాను. అంతా విన్న శర్మ మొహం క్వశ్చన్ మార్కులా మారిపోయింది.

"అదేంటిరా అలా మొహం పెట్టావు?"

ఏం లేదురా నీకు టెలిగ్రాం వచ్చిందంటే నమ్మలేకపోతున్నాను.

ఎందుకని?

ఫేక్టరీ పది రోజులనుంచీ స్ట్రైక్‌లో వుందిరా. ఇప్పుడు కొత్తవాళ్లని తీసుకుంటారా అని...

టెలిగ్రామ్ తీసి ఇచ్చాను.

రా నా గదిలో కూర్చుందువుగాని.

నన్ను అతని గదిలో కూర్చోబెట్టి టెలిగ్రాం తీసుకుని వెళ్లాడు శర్మ.



నేను శూన్యంగా రంగు వెలసిపోయి కనిపిస్తున్న గోడలను చూస్తూ కూర్చున్నాను.

టెలిగ్రాం ఎవరు పంపారో తెలీటంలేదురా గదిలోకి వస్తూనే అన్నాడు శర్మ.

కొంత టైంపడుతుంది ఏ సంగతీ తెలీటానికి. నేనేమీ మాట్లాడలేదు. శర్మ ఏవేవో మాట్లాడుతున్నాడు. ఊరి విశేషాలు అడుగుతున్నాడు.

ఫోను మ్రోగింది. శర్మ ఏదో మాట్లాడాడు.

"నిన్ను పిలుస్తున్నారురా" ఫోను పెట్టేసి శర్మ అన్నాడు. పద. శర్మ నన్ను రెండో అంతస్తుకు తీసికొని వెళ్లాడు. ఓ గది చూపించి లోపల కెళ్లమన్నాడు.

తలుపు మెల్లగా తెరిచాను. చల్లనిగాలి మొహానికి తగిలింది. "లోపలికి రండి" కుర్చీలో కూర్చున్న అతను ఆహ్వానించాడు. కూర్చోమన్నాడు.

"మేము చాలా చింతిస్తున్నాం" అన్నాడు ఈ టెలిగ్రాం మీకు పంపలేదు.

నేనుగోడల మీద ఖరీదైన వర్ణచిత్రాలు చూస్తూ కూర్చున్నాను. ఖరీదైన కార్పెట్ కాళ్లకు తగులుతోంది.

మీకు ఇబ్బంది కలిగించినందుకు చింతిస్తున్నాం అతను మళ్లీ అన్నాడు. ఫ్యాన్ ట్రేలో కూల్ డ్రింక్స్ తీసికొని వచ్చాడు.

'తీసుకోండి.'

నా మనస్సుని ముంచుకొస్తున్న బాధని, నిస్సహాయత్వాన్నికూల్‌డ్రింక్ చల్లబరచాలనుకుంటున్నాడు కాబోలు. తను.

ఏసి గదిలో కూర్చున్న వాళ్లకి కూల్‌డ్రింక్స్ ఎండలో మాడిపోతున్నవాళ్లకి మంచినీరు కరువు!

"ఇక్కడ పని చేసేవాళ్లని ఊరెళ్లటానికి ప్రతీ సంవత్సరం డబ్బులిస్తారురా." బయటికి రాగానే శర్మ అన్నాడు. 'ఊరు వెళ్లినా వెళ్లకపోయినా ఫరవాలేదు. స్వంత ఊరి చిరునామా ఒకటి ఇవ్వాలి అంతే. సెలవు చీటి మీద కూడా ఆ చిరునామా వ్రాయాలి.'

"నాకిదంతా ఎందుకు?" నాకు చిరాకేసింది.

'అందులోనే వుందిరా చిట్కా. ఫేక్టరీలో నీ పేరుతోనే, మన ఊరి వాడొకడున్నాడు. అతను ప్రస్తుతం సెలవులో ఉన్నాడు."

"అయితే"

"అతను సెలవు పెట్టి వెళ్లిన తర్వాతే సమ్మె మొదలైంది. డ్యూటీలో చేరమని అతనికి టెలిగ్రాం ఇచ్చారట."

'ఇస్తే...'

'అదే నీకందిన టెలిగ్రాం.'

"అతని టెలిగ్రాం నా కందటమేమిటి?'

'అదే విచిత్రం. ఆంధ్రదేశంలో ఇప్పుడు అతనికి ఎవ్వరూ లేరుట. ఎప్పుడూ ముప్పై ఏళ్ల క్రితం మన ఊళ్లో ఉండేవాడట. మీ ఇంటి నెంబరు అతనికి గుర్తుండి పోయింది" శర్మ చెప్పుకుపోయాడు.

"నీ పేరు అతని పేరు ఒకటే గదా? అతను ఢిల్లీలోనే . ఉన్నాడు. టెలిగ్రాం నీకందిపోయింది."

నా కళ్లు బైర్లు కమ్మాయి. నోట మాట రాలేదు. నిరుద్యోగినైన నా మీద విధివేసిన జోకుకి నేను ఏడ్వాలో, నవ్వాలో తెలీలేదు.